

ముమ్మిడివరం తహశీల్దార్‌గా సుభాష్ బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి - ముమ్మిడివరం

ముమ్మిడివరం తహశీల్దార్‌గా టి.సుభాష్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ముమ్మిడివరం తహశీల్దార్ కార్యాలయం నందు తహశీల్దార్ గా భాద్యతలు చేపట్టిన సుభాష్‌కు డిప్యూటీ తహశీల్దార్ గోపాల కష్ణ, కార్యాలయ సిబ్బంది, గ్రామ రెవెన్యూ అధికారులు సంఘం, రెవెన్యూ సహాయకుల సంఘం నాయకులు పూల మొక్కను అందించి స్వాగతం పలికారు. ఇప్పటివరకు ఇక్కడ తహశీల్దార్ గా పనిచేసిన ఎంవి.సుబ్బలక్ష్మి కాట్రేనికోన తహశీల్దార్‌గా బదిలీ అయ్యారు. ఆమె స్థానంలో కోటనందూరు తహశీల్దార్‌గా పనిచేస్తున్న సుభాష్ బదిలీపై చ్చారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల ప్రజానీకానికి అందుబాటులో ఉండి సేవలు అందించేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు. .


టి.సుభాష్

కోనసీమ రైలు.. సాగదీత పనులు..

- పిల్లర్లలోనే కోటిపల్లి- నర్సాపురం రైల్వే లైన్
- ట్రాక్‌ల నిర్మాణం ఊసేలేదు
- దిండిలో గోదావరిలోకి ఒరిగిన ఫిల్లర్

ప్రజాశక్తి-రాజోలు

కోనసీమ ప్రజల చిరకాల స్వప్నమైన కోటిపల్లి-నర్సాపురం రైల్వేలైన్ నిర్మాణ పనుల్లో పురోగతి కనిపించడం లేదు. పదేళ్లుగా రైల్వేలైన్ నిర్మాణ పనులు సాగుతూనే ఉన్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది గడుస్తున్నా అడుగు ముందుకు పడడంలేదు. జిల్లాలోని మూడు ప్రధానమైన గోదావరి నదీపాయలపై వారధులకు సంబంధించి పియర్స్ (పిల్లర్స్) నిర్మాణాలు పూర్తయినా గడ్డర్ల ఏర్పాటులో మాత్రం కొన్నేళ్లుగా కాంట్రాక్టు సంస్థ మౌనం వహిస్తోంది. కేంద్రంలో టిడిపి పార్లమెంటు విప్, అమలాపురం ఎంపీ హరీష్ మాదుర్ కోనసీమ ప్రజలకు రైల్వేలైన్ కూత వినిపించాలనే లక్ష్యంతో పనిచేస్తున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో ఆశించిన మేర స్పందన లేకపోవడంతో ఈ రైల్వేలైన్ నిర్మాణ పనులకు అడుగడుగునా అవరోధాలే ఏర్పడుతున్నాయి.

గడ్డర్లు నిర్మించేది ఎప్పుడు

మూడు నదీపాయలపై నిర్మించిన పిల్లర్లపై గడ్డర్లు నిర్మిస్తే రైల్వేట్రాక్ నిర్మాణానికి మార్గం సుగమం అవుతుంది. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది అవుతున్నా గడ్డర్ల నిర్మాణ ప్రగతిపై స్పష్టమైన ప్రకటన అయితే వెలువడలేదు. కోటిపల్లి నుంచి శానపల్లిలంక వరకు గౌతమీ నదిపై వారధి పిల్లర్లు నియమించించారు. గడ్డర్లు వేయకపోవడంతో నదిలో నిర్మించిన 41 పిల్లర్లు మొండి గోడల్లా దర్శనమిస్తున్నాయి.

ఎలైన్మెంట్ మార్చినా

కోనసీమ ప్రాంతానికి ఎంతో కీలకమైన కోటిపల్లి- నరసాపురం లైన్కు కోనసీమ జిల్లాలో భూసేకరణ సవాలుగా మారింది. తొలుత 57 కి.మీ. మేర ఈ లైన్ నిర్మాణానికి 2011-12లో అనుమతిచ్చారు. ఇది కోనసీమ, పశ్చిమగోదావరి జిల్లాల మీదుగా వెళ్తుంది.ఇందులో పశ్చిమగోదావరి జిల్లాలోని 11.31 కిమీ.లకు అవసరమైన 46.11 హెక్టార్ల భూసేకరణ పూర్తయింది. అయితే కోనసీమ జిల్లాలో 18 గ్రామాల మీదుగా ఈ ప్రాజెక్టు వెళ్తుండగా, వాటిలో భూసేకరణలో జాప్యం జరగడంతో,


నత్తనడకలా సాగుతున్న రైల్వే వంతెన పనులు(ఇన్‌సెట్)లో ఒరిగిన ఫిల్లర్

ఎలైన్మెంట్ పరిధిలో కొత్తగా అనేక ఇళ్ల నిర్మాణం జరిగిపోయింది. దీనివల్ల ఎలైన్ మెంట్ను కొన్నిచోట్ల మార్పుచేశారు. దీంతో రైల్వే లైన్ పొడవు కూడా 59.48 కి.మీలకు పెరిగింది. కొత్త ఎలైన్మెంట్ ప్రకారం భూసే కరణ వద్దని కొందరు, పాతది కొనసాగించొద్దని మరికొందరు రైతులు అభ్యంతరాలు చెబుతున్నారు. ఇప్పటివరకు 13 గ్రామాల్లోనే జాయింట్ సర్వే పూర్తయ్యింది. ఇంకా భట్నవిల్లి, అమలాపురం గ్రామీణం, పేరూరు, ఇమ్మిడివరపాడు, బోడసకర్రు గ్రామాలపరిధిలో సర్వే కూడా చేయలేకపోయారు.

బడ్జెట్‌లో నిధులు కేటాయిస్తున్నా..

కోటిపల్లి రైల్వేలైన్ నిర్మాణానికి కేంద్రం ప్రవేశపెట్టే రైల్వే బడ్జెట్‌లో ప్రతిఏటా రూ.వంద కోట్ల వరకు నిధులు కేటాయిస్తున్నారు. ఆ నిధులు ఇక్కడ నిర్మాణ పనులకు వెచ్చించకపోవడంతో బడ్జెట్‌లో కేటాయించిన నిధులను ఇతరప్రాంతాల రైల్వేపనులకు మళ్లిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ముందుకు కదలని ట్రాక్, మౌలిక వసతులు

రైల్వే లైన్‌కు సంబంధించి ఇప్పటివరకు విడుదలైన నిధుల ద్వారా మూడు నదీపాయలపై వంతెన నిర్మాణాలకు సంబంధించి పిల్లర్లకు సంబంధించిన పనులు మాత్రమే జరుగుతున్నాయి.. అయితే గతేడాది బడ్జెట్‌లో రూ.296.51 కోట్లు నిధులు కేంద్రం కేటాయించింది. ఈ నిధుల ద్వారా రైల్వే ట్రాక్, స్టేషన్లు, ఇతర మౌలిక సదుపాయాల కల్పనకు కేటాయిస్తున్నట్లు ప్రకటించింది. ఇప్పటికే పిల్లర్లు నిర్మాణం పూర్తయిన వంతెన పైభాగంలో ఐరెన్ రెయిల్స్, బాక్సు గడ్డర్లు ఇతర పనులు చేపట్టేందుకు టెండర్లు కూడా పిలిచింది.. అయితే మూడు నదీపాయలపై పూర్తయ్యిన పిల్లర్లపై ఇంతవరకు పనులు ప్రారంభం కాలేదు..


భారీగా పెరిగిన అంచనా వ్యయం

కోటిపల్లి - నర్సాపురం రైల్వే ల్కెను పనులు తాజా అంచనాల ప్రకారం రూ.2,500.98 కోట్లు వరకు వెచ్చించాల్సి ఉందని నివేదికలో తేలింది. ఇది గత అంచనాలకు 140 శాతం అధికం.

ఒరిగిన వంతెన పిల్లరు

కోనసీమ జిల్లా, పశ్చిమ గోదావరి జిల్లాలను కలుపుతూ (దిండి-చించినాడ) గోదావరి నది వశిష్ట పాయలో నిర్మిస్తున్న రైల్వే వంతెన ఆరో పిల్లరు ఒరిగిపోయింది. ఈ విషయాన్ని వంతెన నిర్మాణాన్ని పర్యవేక్షిస్తున్న సైట్ మేనేజరు ధ్రువీకరించారు. సుమారు 15 రోజుల క్రితం దిండి వైపు ఆరో నంబరు పిల్లర్ (6పి) నిర్మాణ దశలో ఓవైపు ఒరిగిపోయింది.

రైల్వే లైన్ ఏర్పాటు కోనసీమ అభివృద్ధికి కీలకం



రైల్వేలైన్ కోనసీమ అభివృద్ధికి కీలకం కానుంది. ప్రతి రోజూ ఈ జిల్లా నుంచి ప్రయివేటు, ఆర్‌టిసి బస్సుల్లో వేలాది మంది హైదరాబాద్ ఇతర ప్రాంతాలకు ప్రయాణిస్తూ ఉంటారు. ఈ రైల్వే లైను వల్ల వివిధ పంట ఉత్పత్తులు, ఆక్వా ఉత్పత్తులు రవాణా చేసే సౌకర్యం కలుగుతుంది. ఫలితంగా పారిశ్రామికంగా అభివృద్ధి చెందే అవకాశం ఉంది. ఆంధ్రప్రదేశ్‌లోని ఓడ రేవులను ఈ రైల్వే మార్గం ద్వారా అనుసంధానం చేయవచ్చు.

-కారెం వెంకటేశ్వరరావు, సిపిఎం, జిల్లా కన్వీనర్

రైల్వే లైన్ నిర్మాణానికి కృషి చేస్తా



కోటిపల్లి-నరసాపురం రైల్వే లైన్ 57.21 కి.మీ మేర 25 శాతం రాష్ట్ర వాటా కేటాయింపునకు రాష్ట్ర ప్రభుత్వం పై వత్తిడి తెచ్చి రైల్వే లైన్ నిర్మాణంకు కృషి చేస్తాను. ఇప్పటికే కోటిపల్లి-అమలాపురం రైల్వేలైన్‌కు సంబంధించి పూర్తి స్థాయిలో సేకరించిన భూములను రైల్వే శాఖకు అప్పగించాలని, ఎలైన్మెంట్ ప్రతిపాదనలను అన్నింటిని క్రోడీకరించి అన్ని విధాలుగా ఆమోదకరమైన ఒక ఎలైన్మెంట్ను రూపొందించే ప్రయత్నం జరుగుతోంది.

- దేవ వరప్రసాద్, ఎంఎల్ఎ, రాజోలు

రైల్వే ప్రాజెక్ట్ పూర్తిచేయడమే లక్ష్యం



మరో నాలుగేళ్లలో ఈ రైల్వే ప్రాజెక్టును పూర్తిచేసి ప్రజలకు అంకితం చేయాలన్నదే నా లక్ష్యం. మా నాన్న లోక్‌సభ మాజీ స్పీకర్ బాలయోగి చిరకాల వాంఛగా మిగిలిన ఈ ప్రాజెక్టు నిర్మాణాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకుని పనిచేస్తున్నా. ఇప్పటికే కేంద్ర రైల్వే మంత్రిని కలిసి రైల్వేలైన్ నిర్మాణ ఆవశ్యకత వివరించారు. సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్ సహ కారం తో కేంద్రంపై ఒత్తిడి పెంచి రైల్వేలైన్ నిర్మాణాన్ని పూర్తి చేసేందుకు కృషి చేస్తున్నా.

-గంటి హరీష్, ఎంపీ, అమలాపురం



కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న ఇంజనీరింగ్ కార్మికులు.

ఇంజనీరింగ్ కార్మికుల నిరసన

ప్రజాశక్తి - అమలాపురం

ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ ఇంజినీరింగ్ యూనియన్ సమ్మె కార్యాచరణ లో భాగంగా ఇప్పటికి 44 రోజులుగా సమ్మె చేస్తున్న ప్రభుత్వం స్పందించటం లేదని వారు వినూత్న నిరసనలు చేపట్టారు. అందులో భాగంగా ప్రధాన డిమాండ్ అయిన సమాన పనికి సమాన వేతనం, హెచ్‌ఆర్ పాలిసీ, వయో పరిమితి 60 నుంచి 62 సంవత్స రాలకు పెంచుట మా న్యాయపరమైన డిమాండ్లు అమలు చేయాలి అని డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాకు సంబందించి సంఘ జిల్లా అధ్యక్షులు యెరుబండి వెంకట సత్యనారాయణ ఆధ్వర్యంలో అమలాపురం, మండపేట, రామచంద్రపురం మున్సిపాలిటీ లు అమలాపురం పురపాలక సంఘ కార్యాలయం నుండి ర్యాలీగా వెళ్లి శనివారం కలెక్టర్ కార్యాలయం వద్ద ముట్టడి కార్యక్రమం చేపట్టా రు. కలెక్టర్ అందుబాటులో లేక పోవడంతో జిల్లా రెవెన్యూ అధికారి రాజకుమారి వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమములో అమలాపురం ఇంజినీరింగ్ యూనియన్ అధ్యక్షులు దంగేటి షణ్ముఖ రావు, మండపేట యూనియన్ అధ్యక్షులు సుబ్బరాజు, రామచంద్రపురం యూనియన్ అధ్యక్షులు జి.సత్య శ్రీనివాసరావు, సభ్యులు యం.దుర్గ, నాగరపు శ్రీను, చిక్కాల కుమార్, నంగి కృష్ణ , జంగా నాని, మట్టపర్తి రాజేష్, దంగేటి కృష్ణ, మధు, రమణ, మనోహర్, పి.కుమార్ తదితరులు పాల్గొన్నారు. **మండపేట:** రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్ శాఖలో ఏళ్ల తరబడి పనిచేస్తున్న ఇంజినీరింగ్ కార్మికుల వెతలు తీర్చాలని మండపేట ఇంజినీరింగ్ యూనియన్ ప్రెసిడెంట్ పాలపర్తి సుబ్బరాజు డిమాండ్ చేశారు. శనివారం కార్మికులు చేస్తున్న సమ్మె 29 వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా జిల్లాలో ఉన్న మండపేట, రామచంద్రాపురం, అమలాపురం పురపాలక సంఘాల ఇంజినీరింగ్ కార్మికులు కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కార్మిక నాయకులు మాట్లాడుతూ సంవత్సరాల తరబడి తాము మున్సిపాలిటీలోని విధులు నిర్వహిస్తున్నా తమకు వేతనాలు పెంచడం లేదన్నారు. కనీస వేతన చట్టాలు అమలుచేయాలన్నారు. కార్మికులమైన తమకు ప్రభుత్వ పథకాలు అమలు చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. అనంతరం కలెక్టరేట్ లో అందుబాటులో ఉన్న ఆర్‌డిఒకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మండపేట, రామచంద్రాపురం, అమలాపురం పురపాలక సంఘాల ఇంజినీరింగ్ కార్మికులు పాల్గొన్నారు.



అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న ఉద్యోగులు


ద్రాక్షారామంలో బస్సుల కోసం ప్రయాణికుల అవస్థ

యోగాంధ్ర కోసం విశాఖకు తరలిన బస్సులు

ప్రయాణికులకు తప్పని అవస్థ

ప్రజాశక్తి - రామచంద్రపురం

రాష్ట్ర ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వం విశాఖలో తలపెట్టిన యోగా దినోత్సవం పురస్కరించుకొని శనివారం భారీ ఎత్తున డిపోల్లో బస్సులు విశాఖకు తరలిపోయాయి. దీంతో ప్రయాణికులు ఇక్కట్లు కు గురయ్యారు. ద్రాక్షారామం బస్టాండ్ లో బస్సులు వస్తాయో లేదో తెలియక గంటల తరబడి ప్రయాణికులు బస్సుల కోసం నిరీక్షించారు. ద్రాక్షారామ నుంచి యానాం సర్వీసులు 8 నడుస్తుండగా శనివారం కేవలం రెండు బస్సులు ఏర్పాటు చేశారు. అలాగే మిగిలిన ఏరియాలకు బస్సులు తగ్గించి వేశారు. దీనిపై డిపో మేనేజర్ వివరణ కోరగా రామచంద్రపురం డిపోలో 51 బస్సుల గాను శనివారం 41 బస్సులు విశాఖ వెళ్లాయని కేవలం 10 బస్సులు మాత్రమే నడిపినట్లు వివరించారు. ఆదివారం నుండి సర్వీసులు యధావిధిగా ఇస్తామని ఆయన ప్రజాశక్తి వివరించారు. ఇక బస్సులు లేకపోవడంతో ప్రయాణికులు ఆటోలను ఆశ్రయించారు. దీంతో ఆటోలకు మంచి గిరాకీ ఏర్పడింది.

అందరి సహకారంతోనే మండలాభివృద్ధి

ప్రజాశక్తి - ఉప్పలగుప్తం

ప్రజా ప్రతినిధులు అధికారులు సమన్వయంతో పనిచేసి మండలాన్ని అన్ని రంగాలలోనూ అభివద్ధి చేసేందుకు కషి చేద్దామని ఎంపిపి దంగేటి వీర అచ్యుత జానకిరాంబాబు కోరారు. శనివారం ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిపి అచ్యుత జానకి రాంబాబు అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. తరచూ విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుండడంతో ప్రజలు ఇబ్బందులు పడడమే కాకుండా తాగునీటి సరఫరాకు అంతరాయం కలుగుతుందని సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని జడ్‌పిటిసి సభ్యుడు గెడ్డం సంపదరావు కోరారు. గ్రామాల్లో ప్రజలు తీవ్ర తాగునీటి ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని తాగునీటి సరఫరా విషయంలో అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని విలసవిల్లి ఎంపిటిసి సభ్యురాలు సలాది సురేఖారాణి కోరారు. మురుగు కాలువలను ఆధునికరించకపోవడంతో ఏటా తొలకరి పంటను రైతులు పూర్తిగా నష్టపోతున్నామని కూనవరం మేజర్ డ్రెయిన్‌ను ఆధునికీకరించాలని ఉప్పలగుప్తం సాగు నీటి సంఘం అధ్యక్షుడు మోటూరి రవి కుమార్‌తో పాటు సభ్యులు డ్రెయిన్స్ ఎఇ సునీత కు వివరించారు. 80 శాతం సబ్సిడీపై పురుగు మందులు పిచికారీ చేసుకునేందుకు డ్రోన్లు అందిస్తున్నామని రైతులు సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయాధికారి జి.కుమార్‌బాబు కోరారు. ఆయా శాఖల పనితీరును అధికారులు సభ్యులకు వివరించారు. సమావేశంలో వైస్ ఎంపిపి సాదే శ్రీనివాసరావు, సర్పంచ్‌ల సమాఖ్య మండల అధ్యక్షుడు కడిమి చిన్నవరాజు, సర్పంచ్ లు బద్రి బాబ్జి, జొన్నాడ శ్రీ దుర్గ, యర్రంశెట్టి రామచంద్రరావు, చిక్కం పెదబాబు, పెయ్యల రాజ్ కుమార్, ఎంపిటిసి సభ్యుల సమాఖ్య మండల అధ్యక్షుడు పెట్టా అప్పారావు, ఎంపిటిసి సభ్యులు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిపి అచ్యుత జానకి

షర్మిల పర్యటనను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి - అమలాపురం

పిసిసి చీఫ్ వైఎస్. షర్మిలా రెడ్డి పర్యటనను విజయవంతం చేయాలని డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కొండేటి చిట్టిబాబు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. అమలాపురం విచ్చేయుచున్న సందర్భంగా శనివారం ముమ్మిడివరం గేట్ వింటేజ్ హోటల్ నందు కొండేటి చిట్టిబాబు అధ్యక్షతన జిల్లాలోని నియోజకవర్గ కోఆర్డినేటర్స్ ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ నెల 28వ తేదీన జరిగే షర్మిలా రెడ్డి నిర్వహించే సమావేశానికి పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో వచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో పిసిసి ఉపాధ్యక్షులు కొత్తూరి శ్రీను, పార్టీ పట్టణ అధ్యక్షులు వంటెద్దు బాబి, ఎఐసిసి మెంబెర్ యార్లగడ్డ రవీంద్ర, కో ఆర్డినెటర్స్ అయితాబత్తుల సుభాషిణి, పాలేపు ధర్మారావు, కోట శ్రీనివాసరావు, రౌతు ఈశ్వరరావు, కాంగ్రెస్ పార్టీ నాయకులు సుబ్బు ప్రసాద్, నిమ్మకాయల ప్రసాద్, కుడిపూడి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న కొండేటి చిట్టిబాబు

కార్టూన్ 'నిజం'



డాక్టర్ వాసు నాయక్ సేవలు ఆదర్శనీయం

ప్రజాశక్తి - అమలాపురం రూరల్

వైద్య వృత్తిలో డాక్టర్ వాసు నాయక్ సేవలు ఆదర్శనీయమని అమలాపురం మండల ప్రజా పరిషత్ అధ్యక్షురాలు కుడుపూడి భాగ్యలక్ష్మి కొనియాడారు. కోవిడ్ సమయంలో ఆయన ప్రాణాలకు తెగించి చేసిన వైద్య సేవలు ఎన్నటికీ మరువలేనివన్నారు. శనివారం అమలాపురం మండల పరిషత్ కార్యాలయం సమావేశ మందిరంలో ఆయనకు ఘన సత్కారం ఏర్పాటు చేశారు. ఆమె మాట్లాడుతూ అమలాపురం మండలం బండారులంక పిహెచ్‌సి వైద్యాధికారిగా పనిచేస్తున్న డాక్టర్ ఎం.వాసు నాయక్ సాధారణ బదిలీల్లో భాగంగా గుంటూరు జిల్లా పెదవడ్లపూడి పిహెచ్‌సికి బదిలీ అయ్యారన్నారు. అయితే ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 29 సంవత్సరాల పాటు వైద్య సేవలు అందించి ఎంతోమంది ప్రాణాలు కాపాడిన వాసు నాయక్ బదిలీ కావడం బాధాకరమన్నారు. వైద్య ఆరోగ్యశాఖ జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఎం.సుమలత మాట్లాడుతూ వత్తే ధ్యేయంగా భావించి అంకితభావంతో వైద్య సేవలు అందించిన డాక్టర్ వాసు నాయక్ ను ప్రతీ ఒక్కరు ఆదర్శంగా తీసుకోవాలని కోరారు.

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 29 ఏళ్లపాటు వైద్యసేవలు అందించా

ప్రభుత్వ ఉద్యోగులు ఎక్కడైనా ఉద్యోగం చేయాల్సిందేనని, కానీ 29 సంవత్సరాల పాటు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో వైద్య సేవలు అందించి ఇటు అధికారులు, ప్రజాప్రతినిధులు అటు ప్రజల్లోను సుస్థిర స్థానం సంపాదించిన తాను వీరందరిని వదిలి గుంటూరు జిల్లాకు వెళ్లడం బాధాకరంగా అనిపిస్తుందంటూ డాక్టర్ వాసు నాయక్ కంటతడి పెట్టారు. తన తల్లిదండ్రుల వయస్సు పైబడినందున వారి యోగక్షేమాలు చూసుకునేందుకు సొంత జిల్లా గుంటూరుకు వెళ్లాల్సి వస్తుందన్నారు. అనంతరం డాక్టర్ వాసు నాయక్‌ను ఘన సత్కారం చేశారు. కార్యక్రమంలో ఎంపిడిఒ బాబ్జీ రాజు, డాక్టర్ శర్మ, డాక్టర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు డాక్టర్ ఫణి కిరణ్, డాక్టర్లు అమత, గౌతమి, అన్నామని, కె.శ్రీనివాస్, సుబ్రహ్మణ్యం, ఇందిరా శీతల, సర్పంచులు పెనుమాల సునీత ఏడుకొండలు, కరాటం రత్న ప్రసన్న ప్రవీణ్, ఎంపీటీసీ దొంగ ఆంజనేయులు, సరెళ్ళ రామకష్ణ, చింతా శంకరమూర్తి, జాన గణేష్, అంకం పెదరాజు, సిహెచ్ఒ శేషుఎ బాబు, సూపర్‌వైజర్ రాధా నర్సింహం తదితరులు పాల్గొన్నారు.



డాక్టర్ వాసు నాయక్‌ను సత్కరిస్తున్న వైద్యులు, అధికారులు

అంగన్‌వాడీలకు పథకాలు అమలు చేయాలి

ప్రజాశక్తి - మండపేట

అంగన్‌వాడీలకు సంక్షేమ పథకాల అమలు చేయాలని అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.కృష్ణవేణి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం మండపేట మండలం ఏడిదలో అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సెక్టార్ సమావేశం ఎం.సూర్యకుమారి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రధాన కార్యదర్శి కృష్ణవేణి మాట్లాడుతూ అంగన్‌వాడీలకు ప్రభుత్వం ఇచ్చే గౌరవ వేతనం ధరలకు అనుగుణంగా ఏమాత్రం సరిపోదన్నారు. చాలీచాలని వేతనాలతో అంగన్‌వాడీలు ఏ విధంగా కుటుంబాలు పోషించు కుంటారని ఆమె డిమాండ్ చేశారు. ప్రభుత్వం సాధికార సర్వేలో అంగన్‌వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా నమోదు చేయడం వల్లే సంక్షేమ పథకాలు అమలు కావడం లేదని ప్రభుత్వ ఉద్యోగులు అనే పదాన్ని తొలగించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. అంగన్వాడీలకు రకరకాల యాప్లు తీసుకొచ్చి తీవ్రమైన పని భారం పెంచిందని ఎఫ్‌ఆర్‌ఎస్‌ను రద్దు చేయాలని, అన్ని యాప్లు కలిపి ఒకే యాప్‌గా చేయాలని, మినీవర్కర్లను మెయిన్ వర్కర్లుగా మార్చాలని కోరుతూ ఈనెల 23న అమలాపురం కలెక్టర్ కార్యాలయం దగ్గర జరుగుతున్న ధర్నాలో పెద్ద ఎత్తున అంగన్‌వాడలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో విజయలక్ష్మి, లోకేశ్వరి, ఆదిలక్ష్మి, మంగ తదితరులు పాల్గొన్నారు.


ఏడిద సమావేశంలో మాట్లాడుతున్న ప్రధాన కార్యదర్శి కె.కృష్ణవేణి

స్కూల్ విలీనంపై విద్యార్థుల తల్లిదండ్రుల నిరసన

- మోడల్ స్కూల్ పేరుతో విద్యార్థులను కిలోమీటర్ల దూరం నడిపిస్తారా అని ఆగ్రహం
- పెదపేట పాఠశాలకు తాళాలు వేసిన తల్లిదండ్రులు

ప్రజాశక్తి - ఉప్పలగుప్తం


ఎస్.యానాం పెదపేట ఎంపిపి పాఠశాలలో చదువుతున్న పదిమంది విద్యార్థులను దూరంలో ఉన్న మోడల్ స్కూల్‌కి వెళ్లాలని అధికారులు ఆదేశాలు జారీ చేయడంతో శనివారం విద్యార్థుల తల్లిదండ్రులు ఆగ్రహించారు. పాఠశాలకు తాళాలు వేసి నిరసన తెలిపారు. 3,4,5 తరగతుల విద్యార్థులను మోడల్ స్కూల్ పేరుతో రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న శ్రీరామ్ నగర్ స్కూల్‌ను మోడల్ స్కూల్ చేశామని చెప్పి దాదాపు పది మంది విద్యార్థులను మోడల్ స్కూల్‌కి వెళ్లాలని అధికారులు ఆదేశాలు జారీ చేయడం తగదన్నారు. విద్యార్థులందరూ ఆ మోడల్ స్కూల్‌కి నడిచి వెళ్లాలంటే గ్రామీణ ప్రాంతం కావడంతో నిరంతరం రోడ్లమీద పశువులు ,వీధి కుక్కలు తిష్ట వేసి ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నాయన్నారు. చిన్నపిల్లలు రెండు కిలోమీటర్ల మేర ఎలా నడిచి వెళ్తారని తల్లిదండ్రులు ప్రశ్నించారు. విద్యాశాఖ అధికారులకు మొర పెట్టుకున్నా నిర్లక్ష్యం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు .ప్రభుత్వ పాఠశాలల్లో చదివిస్తున్న తమ పిల్లలకు భద్రత కావాలని తల్లిదండ్రులతో కనీసం చర్చించకుండా రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న స్కూలుకు విద్యార్థులను ఎలా మారుస్తారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా విద్యాశాఖ అధికారులు స్పందించి 3,4,5 తరగతులను పెదపేట పాఠశాలలోనే కొనసాగించి తమ పిల్లల విద్యాభివృద్ధికి సహకరించి భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ విషయాన్ని స్థానిక ఎంఎల్ఎ అయితా బత్తుల ఆనందరావు జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకు వెళ్తామని తెలిపారు. ఈ ఆందోళనలో బూల ప్రసాద్ బాబు, రేవు నాగేశ్వరరావు, సుజాత, రేవు వీర స్వామి, అయితాబత్తుల శ్రీను, కాశి జోసెఫ్, రాపాక భవాని, రేవు రాజు, కాశి పార్వతి, రేవు ఆదిలక్ష్మి, జగడం శిరీష,రేవు దేవి తదితరులు పాల్గొన్నారు.


ఎస్. యానాంలో ఆందోళన చేస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు

పురస్కార గ్రహీతలకు సన్మానం

ప్రజాశక్తి - రామచంద్రపురం

జిల్లా ఉత్తమ ఉద్యోగ అవార్డులు అందుకున్న రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ వాసంశెట్టి సత్యదేవ్ ప్రసాద్, రామచంద్రపురం టౌన్ విఆర్ఒ మద్దాల బాపూజీలకు తహశీల్దార్ బండి మృత్యుంజయరావు,కార్యాలయం సిబ్బంది శనివారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ రామచంద్రపురం మండలానికి రెండు అవార్డులు రావడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించడం ద్వారా మండలానికి మంచి పేరు తీసుకురావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డిటి ఎమ్.మాధురి, రీ సర్వే డిటి కె.హరి, మండల సర్వేయర్ పి.నాగేశ్వరావు, సీనియర్ అసిస్టెంట్ పి.రామారావు, మండల అధ్యక్షులు పి.సత్తిబాబు, గౌరవ అధ్యక్షులు ఎన్.సత్తిబాబు, ఉపాధ్యక్షులు సత్యవతి, కోశాధికారి కె.పరంజ్యోతి, నాయకులు పంపన విష్ణు మూర్తి, చీకట్ల వీరాంజనేయులు పాల్గొన్నారు.


బాపూజీ, సత్యదేవ్‌లను సన్మానిస్తున్న తహశీల్దార్ మృత్యుంజయరావు

దేవాలయాలకు రూ.5 లక్షల విరాళం

ప్రజాశక్తి - కె.గంగవరం

తామరపల్లి గ్రామంలో గల దేవాలయాలకు కొరిపెల్ల కుటుంబం రూ.5లక్షలు విరాళం అందజేసింది. ఈ నిధులతో గ్రామంలోని ఆలయాల్లో అవసరమైన కార్యక్రమాలు అన్నదానాలకు వినియోగించాలని కొరిపెల్ల కుటుంబ సభ్యులు తెలియజేశారు. ఈ మొత్తాన్ని దేవాలయాల కమిటీ సభ్యులకు శనివారం అందజేశారు. విరాళం ఇచ్చిన దాతలకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలియజేశారు


విరాళం అందజేస్తున్న దాతలు

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో వికలాంగుడు మృతి

ప్రజాశక్తి - మామిడికుదురు
మాకనపాలెంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ట్రాక్టర్ ఢీకొని వికలాంగుడు బొడ్డపల్లి సత్యనారాయణ(45) అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..మామిడికుదురు శివారు గాదిదేవర పాలానికి చెందిన వికలాంగుడు ట్రైసైకిల్‌పై ఈదరాడవైపు వెళుతున్నాడు. అదే మార్గంలో వెళుతున్న ట్రాక్టర్ వెనుక నుండి అతని ట్రైసైకిల్‌ను ఢీకొంది. ఈఘటనలో అతడు మృతి చెందాడు. మృతుడు సోదరుడు వీరాస్వామి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు నగరం ఎస్ఐ ఎ.చైతన్యకుమార్ తెలిపారు. మృతదేహాన్ని పోస్ట్ మార్టం కొరకు రాజోలు ఏరియా హాస్పిటల్‌కి తరలించారు.

పాము కాటుతో విద్యార్థి మృతి

ప్రజాశక్తి - తాళ్లరేవు
మండలంలోని పటవల పంచాయతీ శాంతమూలలో ఒక విద్యార్థి పాముకాటుకు గురై మృతి చెందాడు. గ్రామానికి చెందిన వడ్డి రాంబాబు, చిన్న దంపతుల కుమార్తె వడ్డి సంజన (17) గొల్లపాలెం జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతుంది. శనివారం బహిర్భూమికి వెళ్లిన సంజనను పాముకాటు వేసింది. వెంటనే ఆమెను తాళ్లరేవు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మరణించినట్లు వైద్యులు నిర్ధారించారు. అల్లారు ముద్దుగా పెంచుకున్న కుమార్తె ఇలా మరణించడంతో ఆ కుటుంబం కన్నీరు మున్నీరుగా విలపిస్తుంది. కోరంగి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అగ్నిప్రమాదంలో సామగ్రి దగ్ధం

ప్రజాశక్తి - గొల్లప్రోలు
నగర పంచాయతీ పరిధిలో ఎస్‌సి కాలనీకి చెందిన బుళిపే ప్రసాద్‌కు చెందిన ఇంటిలో జరిగిన అగ్నిప్రమాదంలో సామగ్రి దగ్ధం అయింది. శుక్రవారం రాత్రి 10 గంటల సమయంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కల్పించింది. దీంతో ఇంటిలో పిల్లలు కొవ్వొత్తు వెలిగించి బయటకు వచ్చేశారు. ఈ నేపథ్యంలోనే ఇంటిలో ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. హుటాహుటీన పరిసర ప్రాంతంలోని యువకులు మంటలను ఆర్పివేశారు. ఈ ప్రమాదంలో ఇంటిలో ఉన్న నిత్యవసర సరుకులు, మంచం, టివి, ఫ్రిజ్, ఇతర సామాగ్రి పూర్తిగా దగ్ధం అయింది. సుమారు 1.50 లక్షల వరకూ నష్టం జరిగిందని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు.


ట్రాఫిక్‌లో కిక్కిరిసిన యాత్రికుల వాహనాలు

యాత్రికులకు తప్పని ట్రాఫిక్ అవస్థలు

ప్రజాశక్తి - ఆత్రేయపురం
వాడపల్లి శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయానికి వచ్చే యాత్రికులకు శనివారం ట్రాఫిక్ అవస్థలు తప్పలేదు. నూతనంగా ఏర్పాటుచేసిన శ్రీరాంనగర్ సమీపంలోని పార్కింగ్లో వాహనాలను నిలుపుదల చేయకుండా నేరుగా దుర్గమ్మ గుడి నుంచి చెక్‌పోస్ట్ వరకు రోడ్డు రెండు వైపులా వాహనాలను నిలుపుదల చేశారు. దీంతో రోడ్డు ఇరుకుగా మారింది. దీంతో పార్కింగ్ నుంచి యాత్రికులు దర్శనం చేసుకుని వాహనాలలో బయటకు వెళ్లడానికి అవస్థలు పడ్డారు. పోలీసులు వచ్చి ట్రాఫిక్ ను మళ్లించినప్పటికీ యాత్రికులకు ఇబ్బందులు తప్పలేదు.

బాలబాలాజీ స్వామి ఆదాయం రూ.4.13 లక్షలు

ప్రజాశక్తి - మామిడికుదురు
అప్పనపల్లి శ్రీ బాల బాలాజీ దేవస్థానానికి శనివారం వివిధ విభాగాల ద్వారా రూ. 4,13,311 ఆదాయం సమకూరిందని ఆలయ సహాయ కమిషనర్ సత్యనారాయణ తెలిపారు ఇందులో నిత్యాన్నదాన ట్రస్ట్‌కు రూ.లక్షా300 ఆదాయం వచ్చిందన్నారు. 6,000 మంది యాత్రికులు స్వామివారిని దర్శనం చేసుకోగా 3,500 మంది అన్న ప్రసాదం స్వీకరించారన్నారు.


సాయం అందచేస్తున్న ఎన్ టిఆర్ ఫ్యాన్స్

పాత్రికేయునికి ఎన్‌టిఆర్ ఫ్యాన్స్ ఆర్థిక సాయం

ప్రజాశక్తి - రావులపాలెం
ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న జర్నలిస్ట్ ఆకుల లోవరాజును రావులపాలెం టౌన్ వైడ్ ఎన్‌టిఆర్ ఫ్యాన్స్ పరామర్శించారు. లోవరాజు కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి రావులపాలెం టౌన్ వైడ్ ఎన్‌టిఆర్ ఫ్యాన్స్ తరపున రూ.16,500 సాయం అందజేశారు. కార్యక్రమంలో టౌన్ వైడ్ ఎన్‌టిఆర్ ఫ్యాన్స్ ప్రెసిడెంట్ పంపన సతీష్, జనసేన యువనాయకులు అంబటి కిషోర్, కుసుమే సురేష్, మట్టపర్తి మణికంఠ, కదలి నరసింహ,పాటి సాయికృష్ణ, శీలం నాని, మానే తిరుపతి గౌడ్, గంధం వెంకటేష్, దొంగ సందీప్, అప్పారీ సతీష్, ఎన్‌టిఆర్ అభిమానులు పాల్గొన్నారు.

మాతృ వియోగంతో బాధ పడుతున్న పాత్రికేయునికి పరామర్శ

ప్రజాశక్తి - పి.గన్నవరం
బెల్లంపూడిలో మాతృ వియోగంతో బాధపడుతున్న ఎన్‌టివి ఛానల్ పాత్రికేయుడు గూటం శ్రీను కుటుంబాన్ని శనివారం వైసిపి నియోజకవర్గ కో ఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాస్, మండల శాఖ అధ్యక్షులు యన్నాబత్తుల ఆనంద్, దొమ్మేటి వెంకట శివ రామన్, ఎ.సాయిరాం తదితరులు పరామర్శించారు. అనంతరం మృతురాలి చిత్రపటం వద్ద పుష్ప గుచ్ఛాలు ఉంచి సంతాపం తెలిపారు.

వర్షం..హర్షం...



ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి
జిల్లా వ్యాప్తంగా గడిచిన వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు వ్యవసాయ పనులు ఊపందుకున్నాయి. దీంతో రైతన్నలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గోదావరి నదికి వరద నీరు చేరడంతో పుష్కర ఎత్తిపోతల పథకం ద్వారా మెట్ట ప్రాంతానికి నీరందించేందుకు అధికార యంత్రాంగం అడుగులు వేయటంతో మెట్ట ప్రాంతంలోనూ ఆశాజనకమైన పరిస్థితులు నెలకొన్నాయి. అయితే రైతులు పెట్టుబడి సాయం లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వం ధాన్యం బకాయిలు పెండింగ్ ఉన్నాయి. ఆ నిధుల కోసం రైతులు ఎదురుచూస్తున్నారు. ప్రతి ఏటా సాగు ప్రారంభం నాటికి రైతు భరోసా నిధులు రైతుల ఖాతాల్లో జమ చేయటంతో రైతులకు కొంత ఊరట లభించేది. టిడిపి కూటమి ప్రభుత్వం ప్రతి ఏటా రూ.20 వేలు నగదు సాయం అందజేస్తామన్న విషయం విధితమే. తాజాగా అన్నదాత సుఖీభవ పథకం అమలుకు ప్రభుత్వం కసరత్తు పూర్తి చేసింది. అయితే అర్హుల జాబితా అన్నదాతలను ఆందోళనకు గురి చేసింది. జిల్లాలో అత్యధిక మంది కౌలు రైతులు సాగుదారులుగా ఉన్నారు. అయితే కౌలు రైతులను పూర్తిగా దూరం చేయటంపై విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. జిల్లాలో ప్రతి ఏటా గోదావరి వరదల కారణంగా పంట నష్టం జరుగుతున్న విషయం విధితమే. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల హామీలను నిలబెట్టుకోవటంతో పాటు రైతులకు అండగా నిలిచేందుకు చిత్తశుద్ధితో వ్యవహరించాల్సి ఉంది.

భగ్గుమన్న అంగన్‌వాడీలు

రాష్ట్ర ప్రభుత్వం తీరుపై అంగన్‌వాడీలు భగ్గుమన్నారు. తల్లికి వందనం పథకానికి అంగన్‌వాడీ కార్యకర్తలను దూరం చేయటమే ఈ దుస్థితికి కారణం. గర్భిణులు, శిశువులకు పౌష్టికాహారం అందించేందుకు అంగన్‌వాడీ కార్యకర్తలు క్షేత్రస్థాయిలో కీలకంగా పనిచేస్తున్నారు. కనీస వేతనాలు, టిఎ, డిఎలు చెల్లించడంలో ప్రభుత్వాలు అనేక ఇబ్బందులకు గురి చేస్తున్నాయి. తాజాగా వేతనం సాకుగా చూపి తల్లికి వందనం పథకానికి అంగన్‌వాడీ కార్యకర్తలు అనర్హులయ్యారు. దీంతో అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ యూనియన్ ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయాల ఎదుట నిర్వహించిన ఆందోళనలు మిన్నంటాయి. గ్రామ పాలనకు సారధ్యం వహించే సర్పంచులు సైతం ఈ పథకానికి దూరం అయ్యారు. మరోవైపు విద్యుత్ వినియోగం, భూ రికార్డులలో నమోదైన తప్పులు వంటివి అర్హులను సైతం అనర్హులుగా మిగిల్చాయి. మరోవైపు కేంద్రీయ విద్యాలయం, కెజిబివి విద్యార్థులను సైతం ఈ పథకానికి ప్రభుత్వం దూరం చేసింది. దీంతో విద్యార్థులు తల్లిదండ్రులు ఈ వారంలో సచివాయాల చుట్టూ కాళ్లరిగేలా ప్రదక్షిణలు చేయక తప్పలేదు. ఇప్పటికైనా ప్రభుత్వం సానుకూలంగా స్పందించి అర్హులందరికీ ఈ పథకం ఫలాలు అందజేయాల్సిన బాధ్యత ఉంది.

ప్రయాణీకులకు పాట్లు

అంతర్జాతీయ యోగా దినోత్సవం నేపథ్యంలో జిల్లా నుంచి విశాఖకు బస్సులు కేటాయించటంతో వారాంతంలో ప్రయాణీకులకు పాట్లు తప్పలేదు. రాష్ట్ర ప్రభుత్వం భారీ సంఖ్యలో ప్రజలను సమీకరించి విశాఖలో నిర్వహించ తలపెట్టిన యోగా కార్యక్రమం సామాన్యులకు, ప్రభుత్వ ఉద్యోగులకు తీవ్ర ఇబ్బందులకు గురిచేసింది. రంగాలవారీగా గత కొన్ని రోజులుగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా జిల్లా కేంద్రాలలో నిర్వహించిన యోగా కార్యక్రమాలకు ప్రజలను తరలించేలేక చిరుద్యోగులు అవస్థలు పడ్డారు. ఎట్టకేలకు ఈ కార్యక్రమాలను మమ అనిపించినా విశాఖపట్నంలో భారీగా నిర్వహించిన యోగాకు ప్రజల తరలింపు సైతం ఉద్యోగులకు లక్ష్యాలను విధించటం గోరుచుట్టుపై రోకలి పోటులా మారింది. అయితే ఎట్టకేలకు ఈ కార్యక్రమం పూర్తవటంతో అన్ని తరగతుల ఉద్యోగులు ఊపిరి పీల్చుకున్నారు. మొత్తం మీద రాష్ట్ర ప్రభుత్వం తలపెట్టిన అంతర్జాతీయ యోగా దినోత్సవం పలు విమర్శలకు దారి తీసింది.

అస్తవ్యస్తంగా పారిశుధ్యం

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పల్లెలతో పాటు పట్టణాలలోనూ పారిశుధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. ఆర్థిక సంఘం నిధులు పంచాయతీల ఖాతాలలో జమ చేయకపోవటమే ఈ దుస్థితికి కారణం. రాష్ట్ర ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవటంతో అత్యవసర ఖర్చులకు సైతం ఇబ్బందులు తప్పటం లేదు. మరోవైపు ప్రజారోగ్య విభాగాలలో కార్మికుల కొరత వెంటాడుతోంది. తాజాగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో పల్లెలు, పట్టణాలు చిత్తడిగా మారుతున్నాయి. శివారు ప్రాంతాలు దోమలకు ఆవాస కేంద్రాలుగా మారుతున్నాయి. ఈ నేపథ్యంలో విష జ్వరాలు విజృంభించే ప్రమాదం పొంచి ఉంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు దృష్టి సారించి పారిశుధ్య నిర్వహణ సక్రమంగా నిర్వహించేలా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

పారిశుధ్య కార్మికులకు పథకాలు అమలు చేయాలి

ప్రజాశక్తి - మండపేట
పారిశుధ్య కార్మికులకు సంక్షేమ పథకాల అమలు చేయాలని సిఐటియు జిల్లా కోశాధికారి కె. యఔష్ణవేణి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం మండపేట మున్సిపల్ వర్కర్స్ యూనియన్ సమావేశం డొక్కా సీతమ్మ భవనం ఆవరణలో బి.కొండ అధ్యక్షతన జరిగింది ఈ సమావేశంలో కృష్ణవేణి మాట్లాడుతూ ప్రజలు ఆరోగ్యంగా ఉన్నారంటేనే మున్సిపల్ కార్మికులు సక్రమంగా పనిచేయడం వల్ల ప్రజలందరూ ఆరోగ్యంగా ఉన్నారని అన్నారు. ప్రాణాలు తెగించి పనిచేస్తున్న మున్సిపల్ కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు కాకపోవడం చాలాదారుణమన్నారు. ప్రభుత్వం మానవతా దృక్పథంతో ఆలోచించి మున్సిపల్ కాంట్రాక్టు కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని ఆమె డిమాండ్ చేశారు. మున్సిపల్ కార్మికుల యూనియన్ కార్యదర్శి కె.నరేంద్ర మాట్లాడుతూ మండపేట మున్సిపాలిటీలో వర్కర్ల కొరత ఉందని వార్డుకి ఒక వర్కర్ మాత్రమే పని చేస్తున్నారని అన్నారు. దీనివల్ల పని ఒత్తిడి పెరిగి వర్కర్ల అనారోగ్య పాలవుతున్నారని తక్షణం వర్కర్స్ నియామకం చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో పి.లోవరాజు, బంగారు రాజు, పెట్టా శ్రీనివాసు, ఇందుమల్ల చిన్న, ధూళి రమేష్, గణేష్, మణికంఠ, సత్యనారాయణ, ఇంటి వెంకటఅప్పారావు, రాజేంద్రప్రసాద్, దయానందరావు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సిఐటియు జిల్లా కోశాధికారి కె.కృష్ణవేణి

ఉత్సాహంగా యోగాంధ్ర

ప్రజాశక్తి - యంత్రాంగం
అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం జిల్లా రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న యోగాంధ్ర కార్యక్రమం ఉత్సాహంగా జరిగింది. అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజల పాల్గొని యోగసనాలు వేశారు. పలు కార్యక్రమాలు నిర్వహించారు.

అమలాపురం : కిమ్స్ కళాశాల నందు జిల్లా స్థాయిలో ఏర్పాటు చేసిన కామన్ ప్రోటోకాల్ యోగాసనాలు వేసే కార్యక్రమంలో ఎంపీ హరీష్, కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్, జెసి టి.నిషాంతి, చైతన్య వైద్య కళాశాల ఫౌండర్ చైతన్య రాజు తదితరులు పాల్గొన్నారు. **మామిడికుదురు:** మామిడి కుదురు దీప్తి కళాశాలలో ఇంటర్,డిగ్రీ విద్యార్థులచే యోగా గురువు ఆకుల కేతన్ యోగాసనాలు చేయించారు కార్యక్రమంలో ఇన్చార్జి ప్రిన్సిపాల్ మోకా రంగారావు,అధ్యాపకులు పాల్గొన్నారు. **ముమ్మిడివరం:** స్థానిక జూనియర్ కోర్టు,మండల పరిషత్ కార్యాలయం, నగర పంచాయతి కార్యాలయం, అంబేద్కర్ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలల్లో యోగా కార్యక్రమాలు నిర్వహించారుర. ఈ కార్యక్రమాల్లో కోర్టు సూపరింటెండెంట్ ఎ.అనితా రాణి, ఎంపిడిఒ వెంకటాచార్య, కమిషనర్ రవి వర్మ, తదితరులు పాల్గొన్నారు. **మండపేట:** మునిసిపాలిటీ అధ్వర్యం స్థానిక సూర్య కన్వర్షన్ హాల్ లో అంతర్జాతీయ యోగ దినోత్సవం నిర్వహించారు. పుర పాలక సంఘం చైర్ పర్సన్ పతివాడ నూక దుర్గా రాణి తదితరులు పాల్గొన్నారు. **కొత్తపేట:** మండలంలో కొత్తపేట మండల పరిషత్ కార్యాలయం ఎదురుగా యోగా డే నిర్వహించారు. నియోజకవర్గం ప్రతేక అధికారి పివి.రమణ, మండలం ప్రత్యేక అధికారి కెఎస్‌వి.విశాలాక్షి, మండల పరిషత్ అభివద్ధి అధికారి పిఎస్.నరేష్ కుమార్ పాల్గొన్నారు. **అయినవిల్లి:** కె.జగన్నాథపురం జడ్‌పిహెచ్ఎస్ స్కూల్ ఆవరణలో సర్పంచ్ మేడి శెట్టి ఉషారాణి తదితరులు ఆధ్వర్యంలో మెగా యోగా కార్యక్రమం ఘనంగా నిర్వహించారు కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు. **రావులపాలెం:** రావులపాలెంలోని పోతంశెట్టి రామిరెడ్డి పార్కులో ప్రపంచ యోగా దినోత్సవ కార్యక్రమాన్ని గ్రామపంచాయతీ, స్థానిక సిఆర్‌సి యోగ మిత్ర మండలి సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో అధికారులు తదితరులు పాల్గొన్నారు. **ఆలమూరు:** మండల పరిషత్ కార్యాలయంలో ఇన్‌ఛార్జి డిఎల్‌పిఒ ఎంపిడిఒ ఎ.రాజు ఆధ్వర్యంలో యోగా డేను నిర్వహించగా ముఖ్య అతిధిగా ఐసిడిఎస్ జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ శాంతి కుమారి హాజరయ్యారు. కార్యక్రమంలో మండల పరిషత్ ఎఒ మెహర్ ప్రకాష్, సర్పంచ్ నాతి లావణ్య కుమార్ రాజా, టిడిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు. **రామచంద్రపురం:** ప్రతి గ్రామంలోనూ తొమ్మిది చోట్ల యోగాంధ్ర కార్యక్రమాలు నిర్వహించాలని సూచనలు ఇవ్వగా గ్రామాల్లో 9 చోట్ల ఫొటోలు తీసుకుని తూతూ మంత్రంగా కార్యక్రమాలు ముగించారు. స్థానిక కత్తివేంటి పేర్రాజు పంతులు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మున్సిపల్ కమిషనర్ రాజు, మున్సిపల్ చైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదే తదితరులు యోగా కార్యక్రమలో పాల్గొన్నారు. మంత్రి తండ్రి వాసంశెట్టి సత్యం మాట్లాడుతూ యోగాతో మానసిక ఆరోగ్యం సిద్ధిస్తుందని అన్నారు. బస్టాండ్ లో డిపో మేనేజర్ భాస్కర్ రావు ఆధ్వర్యంలో యోగ కార్యక్రమాలు నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం ప్రధాని నరేంద్ర మోడీ ఆధ్వర్యంలో విశాఖలో జరిగిన యోగా దినోత్సవం లో మూడు లక్షల మంది పాల్గొనడం ద్వారా ప్రపంచ రికార్డు నెలకొల్పామని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సభాష్ తెలియజేశారు. ఆయన శనివారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఉక్కు పరిశ్రమ ప్రయివేటీకరణపై విలేకరులు అడిగిన ప్రశ్నలకు మంత్రి సుభాష్ మాట్లాడుతూ ప్రధాని మోడీకి బిజీ షెడ్యూల్ వల్ల ఈ విషయాన్ని ఆయన దృష్టికి తీసుకురాలేదన్నారు. విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ పై ముఖ్యమంత్రితోనూ, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తోను తాను చర్చించి అనంతరం విషయాన్ని కేంద్ర పరిధికి తీసుకువెళ్తామని ఈ సందర్భంగా మంత్రి వివరించారు. **ఆత్రేయపురం:** మహాత్మాగాంధీ జూనియర్ కళాశాల ఆవరణలో యోగా కార్యక్రమంలోకళాశాల కరస్పాడెంట్ పిఎస్.రాజు, మండల ప్రత్యేక అధికారి యంవి.రామారావు, ఎంపిడిఒ బికెఎస్ఎస్.వెంకటరామన్, తహశీల్దార్ టిఆర్.రాజేశ్వరరావు, కళాశాల లెక్చరర్లు పాల్గొన్నారు.


అమలాపురం కిమ్స్‌లో యోగాంధ్ర కార్యక్రమం

బాధిత కుటుంబానికి వేదాంత సాయం

ప్రజాశక్తి - ఉప్పలగుప్తం
విలసవిల్లి పెదమత్రి లో ఈ నెల 17వ తేదీ రాత్రి జరిగిన అగ్ని ప్రమాదంలో తాటాకిల్లు పూర్తిగా దగ్ధమైంది. ఈ ప్రమాదంలో కట్టుబట్టలతో మిగిలి ఉన్న బాధిత కుటుంబానికి ఎస్.యానాం రవ్వ ప్లాంట్ యాజమాన్యమైన వేదాంత కంపెనీ సాయం అందించింది.అ గ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన సాదు శేషవేణి కుటుంబానికి జనసేన నాయకుడు ఇసుకపట్ల రఘుబాబు సూచనల మేరకు వేదాంత కంపెనీ ప్రతినిధి ఎవి శైలేష్ కుమార్ చేతుల మీదుగా శనివారం ఆ కుటుంబానికి నిత్యావసర సరుకులు, కూరగాయలు, వంట సామగ్రి, దుస్తులను అందజేశారు. కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు కల్వకొలను తాతాజీ, ఇసుకపట్ల రఘుబాబు, ఆకుల సూర్యనారాయణ మూర్తి, చిక్కం సూర్య మోహన్, ఆకుల బుజ్జి, కుంపట్ల రమేష్, బండారు వెంకన్న బాబు, గొలకోటి తాతాజీ బేసి గోపాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.


అగ్ని బాధిత కుటుంబానికి సాయం అందజేస్తున్న నాయకులు

46వ రోజుకు ఇంజినీరింగ్ కార్మికుల సమ్మె

ప్రజాశక్తి - పెద్దాపురం
తమ సమస్యల పరిష్కారం కోసం ఇంజనీరింగ్ కార్మికులు చేపట్టిన నిరవదిక సమ్మె శనివారం 46వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా మున్సిపల్ కార్యాలయం సెంటర్లో ఇంజనీరింగ్ కార్మికులు నిర్వహిస్తున్న సమ్మె శిబిరంలో కార్మికులు నిరసన వ్యక్తం చేస్తూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సంఘ అధ్యక్షుడు సుంకర నాగేశ్వరరావు మాట్లాడుతూ 46 రోజులుగా తమ సమస్యల పరిష్కారం కోసం సమ్మె చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడం అన్యాయమన్నారు. తమ వేతనాల పెంచాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘ నాయకులు బాసిన భద్రరావు, ఆకుల రామకృష్ణ, వాకాడ భాస్కర్, ఒ.సోనియా తదితరులు పాల్గొన్నారు.

23న జిల్లా వ్యాప్తంగా ఒలింపిక్ రన్

ప్రజాశక్తి - సామర్లకోట
1894 సంవత్సరంలో ఏథెన్స్‌లో ప్రారంభమైన ఒలింపిక్ క్రీడలను పురస్కరించుకుని ఈనెల 23న జిల్లావ్యాప్తంగా ఒలింపిక్ రన్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ సభ్యులు టి.వైకుంఠం, ప్రకాష్, కొండపల్లి శ్రీనివాస్, ఎన్ కిరణ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షులు చుండ్రు గోవిందరావు ఆధ్వర్యంలో కాకినాడ, అన్నవరం, పిఠాపురం, తుని, జగ్గంపేట, కరప, సామర్లకోట, యు.కొత్తపల్లి మండలాల్లో ఒలింపిక్ రన్ కార్యక్రమాలు చేపడుతున్నట్టు తెలిపారు.

మహిళల ఆర్థిక అభివృద్ధిపై సదస్సు

ప్రజాశక్తి - కాకినాడ
డ్వాక్రా మహిళల ఆర్థిక అభివృద్ధిపై అవగాహన సదస్సును స్థానిక సుందరయ్య భవనంలో జి.భూలక్ష్మి అధ్యక్షతన నిర్వహించారు. శనివారం జరిగిన ఈ సదస్సులో లిడ్ బ్యాంక్ స్టాఫ్ సీనియర్ బ్యాంక్ మేనేజర్ అప్పారెడ్డి పాల్గొని మాట్లాడారు. డ్వాక్రా గ్రూపుల పొదుపు సొమ్మును అంతర్గత అప్పులు నడుపుకోవడం కోసం పొదుపు సొమ్ముపై మీదే హక్కు అని, ఎక్కడైనా బ్యాంకు మేనేజర్లు అభ్యంతరం పెడితే లీడ్ బ్యాంకుకు తెలియచేయాలన్నారు. రుణాల ఇచ్చే సమయంలో బలవంతంగా ఇన్సూరెన్స్ ఫిక్స్‌డ్ డిపాజిట్లు కట్టించకూడదని, అటువంటివి ఎక్కడైనా జరిగితే తమ దృష్టికి తీసుకురావాలని తెలిపారు. అలాగే చాలాచోట్ల ప్రయివేట్ సంస్థలు అనేక రకాలుగా అప్పుల పేరు మీద మహిళలను మోసం చేస్తున్నాయని, వాటి బారిన పడవద్దని సూచించారు. డ్వాక్రా గ్రూపులను క్రమశిక్షణగా నడుపుకుంటూ లబ్ధి పొందాలని అన్నారు. డ్వాక్రా మహిళలు అత్యంత క్రమశిక్షణగా వాయిదాలు చెల్లిస్తున్నారని, ఇది చాలా మంచి పరిణామం అన్నారు. ఐద్వా రాష్ట్ర సహాయ కార్యదర్శి సిహెచ్.రమణి, సామాజిక కార్యకర్త త్రిపన్న ఆదిలక్ష్మి మాట్లాడుతూ డ్వాక్రా మహిళలు అవగాహన లేకపోవడం వల్ల చాలా మోసపోతున్నారన్నారు. ఇటీవల కొన్ని ప్రాంతాల్లో పెద్ద ఎత్తున అవినీతి వెలుగులోకి వచ్చాయని గుర్తు చేశారు. కార్యక్రమంలో కుంచే మణి, ఆర్.గౌరి, బి.గంగాభవాని, ఐ.దుర్గ, కె. దుర్గాదేవి, సరస్వతి, కుమారి, ఎ.ధనలక్ష్మి పాల్గొన్నారు.

వసతి గృహానికి వంట సామగ్రి అందజేత

ప్రజాశక్తి - పెద్దాపురం
స్థానిక వరహాలయ్యపేటలోని ఆనంద నిలయం బాలికల వసతి గృహానికి శనివారం వంటసామగ్రిని ప్రభుత్వం అందజేసిందని హాస్టల్ సంక్షేమ అధికారి జి.చిన్నారి తెలిపారు. శనివారం ఆమె మీడియాతో మాట్లాడుతూ ఈ వంట పాత్రల కిట్‌లో ఒక గ్యాస్ పొయ్యి, 20,10,15 కేజీల 3 వంట గిన్నెలు, 5 పోపుల డబ్బాలు, ఒక కళాయి ఉన్నాయన్నారు.

వెలవెలబోయిన సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి - జగ్గంపేట
స్థానిక మండల పరిషత్‌లో శనివారం జరిగిన సర్వసభ్య సమావేశం వెలవెలబోయింది. ప్రజా గళాన్ని సమావేశంలో వినిపించాల్సిన ప్రజాప్రతినిధులు పూర్తిగా హాజరుకాలేదు. 16 పంచాయితీల పరిధిలో 23 మంది ఎంపిటిసి సభ్యులు ఉండగా, వారిలో సగం మంది కూడా హాజరుకాలేదు. సర్పంచ్‌లు సైతం అంతంతమాత్రంగానే హజరయ్యారు. ఎంఎల్ఎ జ్యోతుల నెహ్రూ సైతం హాజరుకాకపోవడంతో కొంత మంది ప్రజాప్రతినిధులు సమావేశం ప్రారంభం కాగానే వెనుతిరిగారు. ఎంపిపి అత్తులూరి నాగేశ్వరరావు అధ్యక్షతన ప్రారంభమైన సమావేశంలో వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన అధికారులు ఆయా శాఖల వారీగా నివేదికలపై మాట్లాడారు. ఈ సందర్భంగా రామవరం ఎంపిటిసి సభ్యులు దొడ్డ శ్రీను మాట్లాడుతూ విత్తనాలను సబ్సిడీపై అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో జడ్‌పిటిసి సభ్యులు ఒమ్మి బిందుమాధవి, ఎంపిడిఒ ఎవిఎస్.చంద్రశేఖర్, పంచాయితీ రాజ్ డిఇ ఉమాశంకర్, సిడిపిఒ ఎం.పూర్ణిమ, ఇఒపిఆర్‌డి సూర్యభాస్కరరావు, ఎపిఎం ప్రశాంతి, పంచాయితీ రాజ్ ఎఇ నారాయణ, అర్ అండ్ బి ఎఇ సాయికిరణ్, అర్ఐ శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

యువత పోరును విజయవంతం చేయాలి

ప్రజాశక్తి - ప్రత్తిపాడు
ఈ నెల 23న కాకినాడలో నిర్వహించే యువత పోరు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైసిపి నియోజకవర్గ కోఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు శనివారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. ప్రత్తిపాడు నియోజకవర్గం నుంచి యువజన, విద్యార్థి విభాగం నాయకులు సమన్వయంతో పెద్దఎత్తున యువత పోరు కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు. ఇంటికో ఉద్యోగం, నెలకి నిరుద్యోగ భృతి రూ.3 వేలు ఇస్తామన్న హామీ కొండెక్కిందని విమర్శించారు. ప్రతి ఏడాది జనవరి ఒకటో తేదీన నిరుద్యోగులకు జాబ్ క్యాలెండర్ ఇస్తామన్న హామీ ఏమైందని ప్రశ్నించారు.

యానాం వార్తలు


యోగాసనాలు చేస్తున్న ప్రముఖులు, విద్యార్థులు


యానాంలో ఘనంగా యోగా దినోత్సవం

ప్రజాశక్తి - యానాం
స్థానిక వైఎస్ఆర్ ఇండోర్ స్టేడియంలో ప్రాంతీయ పరిపాలనాధికారి ఆర్.మునిస్వామి అధ్యక్షతన అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఇన్‌ఛార్జ్ కమిషనర్ కండవల్లి రామకృష్ణ, సిఐ అడలరసన్, ఇతర శాఖల అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు. అదేవిధంగా రీజెన్సీ పబ్లిక్ స్కూల్, కాలేజీ ఆవరణలో పిఇటిలు బి.శ్రీనివాస్, సోమేశ్ పర్యవేక్షణలో హెచ్ఎం టివిఎస్ఎస్‌వి.ప్రసాదరావు, ప్రిన్సిపల్ పిఎం.ప్రసాద్ ఆధ్వర్యంలో యోగాశనాలు వేయించారు. స్థానిక ప్రభుత్వ ఐటిఐలో మై భారత్ యానాం పేరుతో విద్యార్థుల చేత యోగా చేయించారు. ఈ కార్యక్రమంలో నెహ్రూ యువ కేంద్ర యువజన అధికారి తిర్రి గోపి, ప్రిన్సిపల్ చింతపల్లి కృష్ణ సుధాకర్, ఎన్ఎస్ఎస్ పిఒ ఆనంద్ పాల్గొన్నారు.


సావిత్రి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న అధికారులు

కామిశెట్టి సావిత్రికి ఘన నివాళి

ప్రజాశక్తి - యానాం
ఫ్రెంచ్ పాలన నుంచి యానాం విముక్తి కోసం పోరాడిన స్వాతంత్ర సమరయోధురాలు కామిశెట్టి సావిత్రి వర్ధంతిని సమాచార శాఖ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. స్థానిక ఫెర్రీ రోడ్‌లో ఉన్న ఆమె విగ్రహానికి ఆర్ఎఒ మునిస్వామి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఖండవల్లి రామకృష్ణ, సిఐ అడలరసన్, కొల్లు ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.


మజ్జిగ పంపిణీ చేస్తున్న నిర్వహకులు

వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ

ప్రజాశక్తి - జగ్గంపేట
స్థానిక కాకినాడ రోడ్డులో వాసవి క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న చలివేంద్రంలో శనివారం మజ్జిగ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాన్ని రాష్ట్ర ఆర్యవైశ్య వెల్ఫేర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ కొత్త వెంకటేశ్వరరావు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో విశ్రాంతి ఉపాధ్యాయులు చంద్రమౌళి వెంకట శాస్త్రి, వాసవి క్లబ్ ప్రెసిడెంట్ మానేపల్లి రామానుజ, కొత్త నాగపండు, కాకి విజయ్‌కుమార్, కాకి ఆనంద్‌కుమార్, వాసవి క్లబ్స్ సభ్యులు పాల్గొన్నారు.

శృంగార వల్లభునికి రూ.3.09 లక్షల ఆదాయం

ప్రజాశక్తి - పెద్దాపురం
మండలంలోని తిరుపతి గ్రామంలో ఉన్న శృంగార వల్లభ స్వామి ఆలయానికి శనివారం ఒకరోజు వివిధ రూపాల్లో రూ.3,09,209 లక్షల ఆదాయం వచ్చిందని ఆలయ కార్య నిర్వహణాధికారి వడ్డి శ్రీనివాసరావు తెలిపారు. ప్రత్యేక దర్శనం టికెట్ల ద్వారా రూ.1,94,280, అన్నదాన విరాళాల ద్వారా రూ.78,714, కేశఖండన ద్వారా రూ.8,080, తులాభారం ద్వారా రూ.550, లడ్డూ ప్రసాదం ద్వారా రూ.27,585 వెరసి రూ.3,09,209 ఆదాయం సమకూరిందన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.